

సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న

## సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 2 : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న పలువురిని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్‌తోపాటు పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న వారిని గౌరవించుకోవడం మంచి సాంప్రదాయమన్నారు. స్వచ్ఛత హీ సేవలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ జనగామ లక్ష్మణ్‌రావు, దూడం నాగభూషణం, పూదరి చంద్రమౌళి, జవాన్ ప్రభాకర్, పారిశుధ్య కార్మికురాలు గడిపె వెంకవ్వను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు నళినీదేవి, స్వర్ణలత, రత్నమాల, సుప్రజ, భాగ్యారెడ్డి, హరీశ్, రాజు, శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, ఇంజినీర్ రవికుమార్ పాల్గొన్నారు.

## ఆర్మీ ఉద్యోగానికి ఆశ్రిత ఎంపిక



ఆశ్రితను సన్మానిస్తున్న లోక్‌సత్తా, స్ఫూర్తి అసోసియేషన్ ప్రతినిధులు

హుస్నాబాద్, అక్టోబర్ 2 : పట్టుదలతో చదివి శారీరక పరీక్షలను సైతం ఎదుర్కొని ఆర్మీ ఉద్యోగానికి ఎంపికైన ఆకుల ఆశ్రితను లోక్‌సత్తా, స్ఫూర్తి అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. సోమవారం హుస్నాబాద్‌లోని స్ఫూర్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆశ్రితను ఘనంగా సన్మానించారు. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన మెకానిక్ ఆకుల తిరుపతి-రాధ దంపతులకు ముగ్గురు కూతుళ్లలో రెండో కూతురైన ఆశ్రిత ఇంటర్మీడియట్ వరకు మోడల్ స్కూల్‌లో చదివింది. డిగ్రీ కరీంనగర్‌లో పూర్తి చేసింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఆర్మీలో జనరల్ డ్యూటీ కానిస్టేబుల్‌గా ఆశ్రిత ఎంపికైంది. కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, ఆయా సంస్థల ప్రతినిధులు నోముల చంద్రారెడ్డి, తిరుపతి, మహేశ్, కుమారస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రహరీ కూల్చివేసిన వారిపై కేసులు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 2 : మద్దూరు మండలం నర్సాయపల్లిలో పల్లె ప్రకృతి వనం ప్రహరీని కూల్చి వేసి మొక్కలను ధ్వంసం చేసిన ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ యునూస్ అహ్మద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం ప్రహరీని కూల్చి, మొక్కలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## గీత కార్మికుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 2 : గీత కార్మికుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు, ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ అన్నారు. సోమవారం జాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో వేసిన బోరుమోటర్‌ను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గీత కార్మికులకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ భూములు, చెరువు కట్టలపై ఈత ఖర్జూరా మొక్కలు పెంచుతున్నదన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 2 : గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మద్దూరు, ధూళిమిట్ట గ్రామాల సర్పంచులు కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయా గ్రామాల్లో గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అంతకుముందు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై గ్రామ సభల్లో చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ బొప్పె కనకమ్మ, ఉపసర్పంచులు మహ్మద్ ఆరీఫ్, పోత రాజుల లింగం, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ స్ఫూర్తితో తెలంగాణను సాధించాం

- బీఆర్ఎస్ హయాంలోనే చేర్యాల పట్టణాభివృద్ధి
- నియోజకవర్గం గల్లంతుకు కారణం పొన్నాల, కొమ్మూరిలే..
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



చేర్యాలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల, అక్టోబర్ 2 : జాతిపిత గాంధీజీ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ అహింసామార్గంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో రూ.5 లక్షలతో వడ్డెర సామాజికవర్గ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత జాతిపితగా గాంధీజీ పేరుగాంచితే తెలంగాణ గాంధీగా సీఎం కేసీఆర్‌ను ప్రజలు అభివర్ణిస్తున్నట్లు తెలిపారు. ఒక్క రక్తపు చుక్క కిందపడకుండా తెలంగాణ సాధిస్తానని ఉద్యమం ప్రారంభించే ముందే సీఎం కేసీఆర్ ప్రకటించారని, అదే పద్ధతిలో ప్రత్యేక రాష్ట్రం సాధించి చూపించారన్నారు. చేర్యాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు ప్రారంభించిందన్నారు. చేర్యాల అసెంబ్లీ నియోజకవర్గం గల్లంతు కావడానికి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలే కారణమన్నారు. నియోజకవర్గం కోల్పోయి మండల స్థాయికి దిగజారిన చేర్యాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందన్నారు. చేర్యాల పట్టణాభివృద్ధికి రూ.35 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా రైతుబంధు పథకం ద్వారా పట్టణ రైతులకు రూ.18 కోట్లు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా పట్టణానికి చెందిన ఆడబిడ్డలకు రూ.15 కోట్లు మంజూరు చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇప్పటివరకు చేర్యాలకు రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ప్రస్తుతం మంజూరు చేసిన నిధులు సరిపడని పక్షంలో మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాలుగు మండలాల చైర్మన్ బీరెడ్డి ఇన్నారెడ్డి, బీఆర్ఎస్‌వై ఇన్‌చార్జి శివగారి అంజయ్య, కౌన్సిలర్లు పచ్చిమడ్ల సతీశ్, ఆడెపు నరేందర్, నాయకులు మంచాల కొండయ్య, ఎక్బాల్, పచ్చిమడ్ల సిద్ధిరాములు, బుడిగె శ్రీనివాస్, పచ్చిమడ్ల సాయికిరణ్, వడ్డెర సంఘం అధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

**రెవెన్యూ డివిజన్ దీక్షలకు ఎమ్మెల్యే సంఘీభావం**

చేర్యాల, అక్టోబర్ 2 : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ వద్ద చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన దీక్షలకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ ప్రకటన త్వరలో వస్తుందని, ప్రజల కోరిక మేరకు బీఆర్ఎస్ సర్కారు పని చేస్తున్నదన్నారు. ఎమ్మెల్యేతోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, నాయకులు బీరెడ్డి ఇన్నారెడ్డి, శివగారి అంజయ్య దీక్షకు సంఘీభావం తెలిపారు. దీక్షలో జేఏసీ కో-చైర్మన్ ఒగ్గు రాజు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు అందె బీరన్న, స్టూడెంట్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

**22వ రోజుకు చేరుకున్న దీక్షలు..**

పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు సోమవారం 22వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సీపీఐ మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్, అందె అశోక్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# మీడియా రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

**టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి**




హుస్నాబాద్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

చేర్యాల, అక్టోబర్ 2 : జాతీయ మీడియా రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన చంద్రారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం సేవ్ జర్నలిజం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, అక్రిడేటెడ్ జర్నలిస్టులకు కేంద్రం రైల్వే పాసులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడి యా జర్నలిస్టులు పాల్గొన్నారు.

**గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత..**

హుస్నాబాద్, అక్టోబర్ 2 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జర్నలిస్టులు హుస్నాబాద్ డివిజన్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు మాట్లాడుతూ సేవ్ జర్నలిజం పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశామన్నారు. జాతీయ మీడియా రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, వెంటనే అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రైల్వేపాస్‌లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి, రాజు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

